సాక్షి తిరుపతి

శనివారం । 25 । జనవరి । 2025

I



ఒత్తిడి 'పది'ంతలు దూరం

పది పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేందుకు అధికారులు సరికొత్త విధానాలు రూపొందించారు. - IIలో



సిలిండర్ పేలి..

సిలిండర్ పేలి ఇద్దరు తీవ్రంగా గాయపడగా.. ఒకరికి స్వల్ప గాయాలైన ఘటన వెంకటగిరి పట్టణంలో చోటుచేసుకుంది. - IIలో



గీత కార్మికులకు..

జిల్లాలోని గీత కార్మికులకు 23 మద్యం దుకాణాలు కేటాయించినట్టు జేసీ శుభం బన్సల్ పేర్కొన్నారు. - IIలో

న్యూస్‌రీల్

క్షేమంగా వెళ్లిరండి



అలిపిరి డిపోలో డ్రైవర్లకు రోజా పూలు అందిస్తున్న డీఎం హరిబాబు, అసిస్టెంట్ మేనేజర్

తిరుపతి అర్బన్: 'అలిపిరి డిపోకు చెందిన సర్వీసుల్లో 92 శాతం తిరుమల ఘాట్‌లో నడుస్తున్నాయి.. మీరంతా క్షేమంగా వెళ్లిరండి' అంటూ డిపో మేనేజర్ హరిబాబు డ్రైవర్లకు రోజా ఫ్లవర్స్‌ను అందించారు. రోడ్డు భద్రతా వాసోత్సవాల్లో భాగంగా అలిరిపి డిపోలో డ్రైవర్లతో ఆయన శుక్రవారం సమావేశమయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తిరుమల శ్రీవారి దర్శనం కోసం దేశ విదేశాల నుంచి భక్తులు వచ్చిపోతున్న విషయాన్ని గుర్తుచేశారు. వారితో మర్యాదగా మాట్లాడాలని చెప్పారు. తిరుపతితోపాటు తిరుమలలో రిక్వెస్ట్ స్టాపింగ్‌ను భక్తులు కోరితే...ట్రాఫిక్ సమస్యలను గుర్తించి వారి అవసరాల నిమిత్తం స్టాపింగ్ చేయాలన్నారు.. డ్యూటీకి వస్తే విధులపైనే దృష్టి సారించాలని, అంతేతప్ప ఇంట్లో సమస్యలు లేదా ఆరోగ్య సమస్యలపై ఆలోచన చేస్తే వచ్చే ఇబ్బందులను గుర్తుచేశారు. అలాగే ప్రతి డ్రైవర్ ట్రాఫిక్ రూల్స్‌ను విధిగా పాటించాలని చెప్పారు. వారితోపాటు అసిస్టెంట్ మేనేజర్ పుష్పలత, అసిస్టెంట్ ఇంజినీర్ ప్రభాకర్, పలువురు సూపర్ వైజర్లు, డ్రైవర్లు, మెకానిక్‌లు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 15 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 15 కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. గురువారం అర్ధరాత్రి వరకు 56,225 మంది స్వామివారిని దర్శించుకోగా 19,588 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.95 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 15 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

ఐసీడీఎస్ పీడీగా వసంతాబాయ్



వసంతాబాయ్

తిరుపతి అర్బన్: తిరుపతి జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా వసంతాబాయ్‌ని నియమిస్తూ ఆ విభాగానికి చెందిన రాష్ట్ర కార్యదర్శి సూర్యకుమారి శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. వైఎస్సార్ జిల్లాలోని ఐసీడీఎస్ పరిధిలో వేర్‌హౌస్ రీజనల్ మేనేజర్‌గా పనిచేస్తున్న ఆమెను తిరుపతికి బదిలీ చేశారు. ఈ మేరకు ఆమె రెండు మూడు రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు. తిరుపతి జిల్లాలో పనిచేస్తున్న జయలక్ష్మికి రెండు రోజుల క్రితం పదోన్నతి కల్పించి ఒంగోలు ఆర్జేడీగా బదిలీ చేశారు. వంసతబాయ్ వచ్చిన తర్వాత జయలక్ష్మి రిలీవ్ కానున్నారు.

విద్యతోనే సమాజాభివృద్ధి



స్టడీ మెటీరియల్‌తో విద్యార్థులు, ఉపాధ్యాయులు, నిర్వాహకులు

తిరుపతి ఎడ్యుకేషన్ : విద్యతోనే వ్యక్తిగత, సమాజాభివృద్ధి సాధ్యమని ఆర్‌ఎస్ మాడ వీధి నగరపాలక హైస్కూల్ హెచ్‌ఎం రేవతి అన్నారు. జాతీయ బాలిక దినోత్సవం, అంతర్జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆ స్కూల్‌లో గిరిజన నవ సమాజ్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. సమాజంలో వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలను స్ఫూర్తిగా తీసుకుని బాలికలు ఉన్నత స్థానాలకు చేరుకోవాలని హెచ్‌ఎం ఆకాంక్షించారు. అనంతరం గిరిజన నవ సమాజ్ వ్యవస్థాపక అధ్యక్షుడు శివశంకర్ నాయక్ మాట్లాడారు. ఆ తర్వాత పదో తరగతి విద్యార్థులు 45 మందికి బిట్ బ్యాంక్, స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు.కార్యక్రమంలో గిరిజన నవ సమాజ్ విద్యార్థి విభాగం నాయకులు బాలు నాయక్, సురేంద్ర, ఉపాధ్యాయులు కవిత, వాణి, శ్రీలేఖ, బాలు, చౌదరీబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

4న శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో రథసప్తమి

తిరుపతి కల్చరల్: నారాయణవనం శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఫిబ్రవరి 4న రథసప్తమి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. ప్రతి ఏటా మాఘ శుద్ధ సప్తమి సూర్య జయంతిని పురస్కరించుకుని టీటీడీ స్థానిక ఆలయాల్లో రథసప్తమి నిర్వహించడం ఆనవాయితీ. ఆ రోజు ఉదయం భానుని తొలిరేఖలు సూర్యప్రభ వాహనంలో కొలువైన స్వామివారి లలాట పలకం, నాభి, పాద కమలాలపై ప్రసరించే అద్భుత దృశ్యాన్ని తిలకించడానికి భక్తులు వేయి కళ్లతో ఎదురుస్తూంటారు. స్వామి, అమ్మవార్లు ఏడు ప్రధాన వాహనాలపై ఊరేగి భక్తులను అనుగ్రహించనున్నారు.



సత్యవేడు నియోజకవర్గం, వరదయ్యపాళెం మండలంలో లారీలకు ఎక్కిస్తున్న వరి ధాన్యం బస్తాలు

వరికి గిట్టుబాటు ధర అందేనా?

- ప్రారంభమైన వరి కోతలు
- మందకొడిగా ధాన్యం ధరలు
- ఆశించిన స్థాయిలో రాని దిగుబడులు
- ఊసేలేని పంట కొనుగోలు కేంద్రాలు
- నష్టాలు తప్పవంటున్న అన్నదాతలు



వరదయ్యపాళెం మండలంలో బస్తాల్లో నింపిన వరి ధాన్యం

ప్రాధాన్యం లేదా?

జిల్లాలో వరి సాగు వివరాలు

సబ్‌డివిజన్ పేరు	సాగు విస్తీర్ణం (హెక్టార్లలో)
సత్యవేడు	9,616
గూడూరు	15,624
వెంకటగిరి	8,700
శ్రీకాళహస్తి	16,962
సూళ్లూరుపేట	11,200
తిరుపతి	2,200
నాయుడుపేట	12,023
పుత్తూరు	6,800

అంతా నష్టం



నాది వరదయ్యపాళెం మండలం, కోవూరుపాడు గ్రామం. నా పేరు రాంబాబు. నేను 11 ఎకరాల్లో వరి పంట సాగు చేశాను. అందులో ఐదు ఎకరాలు నా సొంత భూమి కాగా మరో 6 ఎకరాలు కౌలుకు తీసుకున్నాను. మొత్తంగా ఎకరాకు 20 నుంచి 25 బస్తాల దిగిబడి వచ్చింది. నేను ఈ ఏడాది 16కి 38 కొత్త పంట సాగుచేశాను. ఎకరాకు రూ.30 వేల వరకు పెట్టుబడి అయ్యింది. పంటను విక్రయిస్తే వచ్చింది నష్టమే.

బస్తా రూ.1,600



నా పేరు కృష్ణయ్య. మాది వరదయ్యపాళెం మండలం, పెద్దపాండూరు గ్రామం. నేను ఎనిమిది ఎకరాల్లో 16 కి 38 రకం పంటను సాగుచేశాను. 170 బస్తాలు దిగుబడి రాగా.. బస్తా రూ.1,600 చొప్పున విక్రయించాను. ఎకరాకు రూ.30 వేలు పెట్టుబడి పోను చేతికొచ్చింది అంతంతమాత్రమే. గిట్టుబాటు ధర కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.



సత్యవేడు నియోజకవర్గంలో ప్రారంభమైన వరి కోతలు

వరదయ్యపాళెం: రబీలో సాగుచేసిన వరి పంటకు సంబంధించి జిల్లాలోని పలు చోట్ల ఒబిళ్లు మొదలయ్యాయి. ప్రధానంగా సత్యవేడు, వరదయ్యపాళెం, బీఎన్‌కండ్రిగ, తడ, సూళ్లూరుపేట ప్రాంతాల్లో వరి కోతలు చేపడుతున్నారు. రబీలో జిల్లా వ్యాప్తంగా 2 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా.. ఇప్పుడిప్పుడే వరికోతలకు శ్రీకారం చుడుతున్నారు.

ధాన్యం ధరలు అంతంతమాత్రమే

కూటమి ప్రభుత్వంలో వరి ధాన్యానికి నామమాత్రంగా గిట్టుబాటు ధర లభిస్తోంది. గత ఏడాదితో పోల్చుకుంటే బస్తాకు రూ.500 నుంచి రూ.700 వరకు ధర తగ్గిపోయినట్లు రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ప్రారంభ దశలోనే 10 శాతం వరకు వరి కోతలు మొదలయ్యాయి. పూర్తి స్థాయిలో పంట చేతికొస్తే ధరల పరిస్థితి ఏంటని రైతులు లోలోన మదనపడుతున్నారు. పంటను నిల్వ చేసుకునేందుకు గోడౌన్లు లేక తక్కువ ధరకే విక్రయించాల్సిన పరిస్థితి నెలకొందని ఆందోళన చెందుతున్నారు.

కొనుగోలు కేంద్రాలు ఎక్కడ?

వరి కోతలు మొదలైనప్పటికీ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఎక్కడా ఏర్పాటు కాలేదు. ఆ దిశగా జిల్లాలో కొనుగోలు కేంద్రాలకు సంబంధించి విధివిధానాలు ఇప్పటి దాకా రూపకల్పనకు నోచుకోలేదు. కేవలం వ్యవసాయశాఖ అధికారులు ఈకేవైసీ, పంట నమోదు పైనే దృష్టి పెడుతున్నారు తప్ప ధాన్యం కొనుగోలు కేంద్రాల గురించి పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

ధాన్యం ధరలు

ధాన్యం రకం	నాటి ధర	నేటి ధర
ఆర్ఎన్ఆర్(15048)	రూ.2,300	రూ.1,600
బీపీటీ (5204)	రూ.2,200	రూ.1,500
ఎంటీయూ 12కి71	రూ.2,100	రూ.1,600
16కి 38	రూ.2,200	రూ.1,650

తగ్గిన దిగుబడి

ఈ ఏడాది తరచూ వర్షాలు పడడం, మంచు శాతం ఎక్కువ కావడం వెరసి పంట దిగుబడిపై ప్రభావం చూపింది. ఎకరం వరి పంటకు 30 నుంచి 40 బస్తాల వరకు దిగుబడి అయ్యేది. కానీ ఈ సారి 20 నుంచి 25 బస్తాలకే పరిమితమైంది. సత్యవేడు, వరదయ్యపాళెం, బీఎన్‌కండ్రిగ ప్రాంతాల్లో ఈ పరిస్థితి నెలకొంది.

నిలిచిపోయిన ఎగుమతులు

ఈ ఏడాది వరి ధాన్యం ఎగుమతులు లేని కారణంగా ధరలు పడిపోయినట్లు వ్యాపారులు చెబుతున్నారు. గత ఏడాది ఎక్స్‌పోర్ట్ మార్కెట్ బాగా జరిగినందువల్లే బస్తా రూ.2,300కు పైగా ధర పలికినట్లు చెబుతున్నారు.

గిట్టుబాటు ధర లేదు



వరి కోతలు ప్రారంభమయ్యాయి. వాతావరణ పరిస్థితుల్లో వస్తున్న మార్పుల రీత్యా పంటను ప్రభుత్వం కొనుగోలు చేసి రైతుల కష్టాలను దృష్టిలో పెట్టుకొని గిట్టుబాటు ధర కల్పించాలి. లేని పక్షంలో తీవ్రంగా నష్టపోతాం.

– సురేష్, రైతు, వరదయ్యపాళెం మండలం

రైతులను పట్టించుకోవాలి



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులను విస్మరించింది. కనీసం ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రోత్సాహకాలు ఇవ్వలేదు. పెట్టుబడి సాయం అందలేదు. గత ప్రభుత్వంలో బస్తా రూ.2,300 విక్రయించగా.. అదే బస్తా ఇప్పుడు రూ.1,600కు కొనుగోలు చేస్తున్నారు.

– మల్లికార్జున రెడ్డి, సత్యవేడు నియోజకవర్గం, రైతు విభాగం అధ్యక్షుడు

వ్యాపారులదే రాజ్యం



గత ఏడాది వరి పంటకు మంచి గిట్టుబాటు ధర లభించడంతో ఆదాయం చూశాం. బస్తా రూ.2,400కు విక్రయించాం. ఈ ఏడాది 15 ఎకరాల్లో వరిసాగు చేశాను. బస్తా రూ.1,600 వరకు రేటు పలుకుతోంది. వ్యాపారులు సిండికేట్‌గా మారి రైతుల వద్ద తక్కువ ధరకే కొనుగోలు చేస్తున్నారు.

– గంగయ్య, రైతు, సీఎల్ఎన్‌పల్లి, వరదయ్యపాళెం మండలం

29న మరో ప్రయోగం!



జీఎస్ఎల్వీ ఎఫ్-15 రాకెట్ మొదటి దశ



రాకెట్‌కు చుట్టూరా ద్రవ ఇంధన స్ట్రాపాన్ బూస్టర్లు



2,250 కిలోల బరువు కలిగిన నావిక్-02



రాకెట్ శిఖరభాగాన అనుసంధానం చేసిన నావిక్-2



అనుసంధానం చేసేందుకు ట్రాక్‌పై తరలిస్తున్న దృశ్యం

- జీఎస్ఎల్వీ ఎఫ్-15 రాకెట్ ప్రయోగానికి సన్నద్ధం
- 28న ఎంఆర్ఆర్ సమావేశం

సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ షార్‌లోని రెండో ప్రయోగ వేదిక నుంచి జీఎస్ఎల్వీ ఎఫ్-15 రాకెట్ ద్వారా నావిక్-02 ఉపగ్రహాన్ని ఈనెల 29న ప్రయోగించేందుకు సర్వం సిద్ధం చేస్తున్నారు. షార్‌లోని మొదటి వెహికల్ అసెంబ్లింగ్ బిల్డింగ్ (వ్యాబ్)లో మూడు దశల రాకెట్ అనుసంధానాన్ని పూర్తిచేశారు. రాకెట్‌కు అన్ని పరీక్షలు నిర్వహించి శుక్రవారం వ్యాబ్ నుంచి ఉంబ్లికల్ టవర్ (ప్రయోగవేదిక)కు అనుసంధానించే ప్రక్రియను చేపట్టారు. ఈనెల 28న షార్‌లో ఈ ప్రయోగానికి సంబంధించి ఎంఆర్ఆర్ సమావేశం నిర్వహించనున్నారు. అనంతరం కౌంట్‌డౌన్ సమయాన్ని, ప్రయోగ సమయాన్ని అధికారికంగా ప్రకటిస్తారు. పీఎస్ఎల్వీ రాకెట్‌ను నాలుగు దశల్లో ప్రయోగిస్తే జీఎస్ఎల్వీ రాకెట్‌ను మూడు దశల్లోనే ప్రయోగిస్తారు. 50.9 మీటర్ల పొడవున్న జీఎస్ఎల్వీ ఎఫ్-15 రాకెట్ ప్రయోగసమయంలో 420.7 టన్నుల బరువుతో భూమి నుంచి నింగికి బయలుదేరుతుంది. ఈ ప్రయోగంలో 2,250 కిలోల బరువు కలిగిన నావిక్-02 ఉపగ్రహాన్ని రోదసీలోకి పంపనున్నారు. జీఎస్ఎల్వీ ఎఫ్-15 శ్రీహరికోట రాకెట్ కేంద్రం నుంచి వందవ ప్రయోగం కావడం విశేషం.

ప్రయోగమిలా..

- నాలుగు స్ట్రాపాన్ ద్రవ ఇంధన బూస్టర్ల సాయంతో మొదటి దశ ప్రారంభమవుతుంది.
- ఒక్కో స్ట్రాపాన్ బూస్టర్‌లో 42.675 టన్నుల ద్రవ ఇంధనం నింపుతారు.
- కోర్ అలోన్ దశలో 138.1 ఘన ఇంధనంతో మొదటి దశను ఘన, ద్రవ ఇంధనాల మిశ్రితంతో 151 సెకెండ్లలో పూర్తి చేస్తారు.
- కోర్‌అలోన్ దశతో కలిపి 308.5 టన్నుల ద్రవ, ఘనఇంధనంతో కలగలిపి మొదటి దశను నిర్వహిస్తారు.
- 42.15 టన్నుల ద్రవ ఇంధనం సాయంతో రెండో దశను 294 సెకెండ్లకు పూర్తి చేస్తారు.



ప్రయోగానికి సిద్ధంగా ఉన్న జీఎస్ఎల్వీ ఎఫ్-15 ఉపగ్రహ వాహకనౌక

- క్రయోజనిక్‌దశలో 14.96 టన్నుల క్రయోజనిక్ ఇంధనం సాయంతో 1,140 సెకెండ్లకు మూడో దశను కటాఫ్ చేస్తారు.
- ఆ తరువాత జీఎస్ఎల్వీ ఎఫ్-15 ఉపగ్రహ వాహకనౌక ద్వారా 2,250 కిలోల బరువు కలిగిన నావిక్-02 ఉపగ్రహాన్ని మోసుకెళ్లి 1150.38 సెకెండ్లకు (19.17 నిమిషాలు) 170 కిలో మీటర్లు పెరిజీ (భూమికి అతి దగ్గరగా), 36,577 కిలో మీటర్లు అపోజీ (భూమికి దూరంగా) జియో ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్ (జీటీఓ)లోకి ప్రవేశపెట్టనున్నారు.
- అక్కడి నుంచి ఉపగ్రహాన్ని బెంగళూరుకు సమీపంలోని హసన్‌లో ఉన్న మాస్టర్ కంట్రోల్ సెంటర్ వారు వారి అధీనంలోకి తీసుకుని ఉపగ్రహంలో నింపిన 1,250 కిలోల ఇంధనాన్ని దశల వారీగా మండించి భూమికి 36 వేల కిలోమీటర్ల ఎత్తులోని భూస్థిర కక్ష్యలో ప్రవేశపెట్టనున్నారు.

మహిళా ఓటర్లే అధికం

- నేడు జాతీయ ఓటర్ల దినోత్సవం
- జిల్లా ఓటర్లు 18.04.229 మంది



తిరుపతి అర్బన్: జిల్లాలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు సంబంధిత అధికారులు పేర్కొన్నారు. భారత ఎన్నికల సంఘం ఇటీవల ఓటర్ల తుది జాబితాను విడుదల చేసింది. ఇందులో భాగంగా తిరుపతి జిల్లా ఓటర్లు మొత్తం 18,04,229 మంది కాగా అందులో స్త్రీలు 9,25,735 మంది, పురుషులు 8,78,321 మంది, ఇతరులు 173 మంది ఉన్నారు. ఈ ఏడాది తుది జాబితా ప్రకారం 47,414 మంది స్త్రీల ఓట్లు అధికంగా ఉన్నాయి.

ఓటు హక్కు వినియోగించుకోవాలి



నాకు కొత్తగా ఓటు వచ్చింది. 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తొలి సారి నా ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నా. ఓటు చాలా విలువైంది. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి. – పద్మప్రియ, శ్రీకాళహస్తి నియోజకవర్గం

దరఖాస్తు చేసుకున్నాం



కొత్తగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకున్నాను. ఓటు వచ్చిన తర్వాత జరిగే ఏ ఎన్నికల్లోనైనా నా ఓటును సద్వినియోగం చేసుకుంటాను. తప్పకుండా 18 ఏళ్ల నిండిన వారంతా ఓటు హక్కును నమోదు చేసుకోవాలి.

– చరిత, తిరుపతి

అసెంబ్లీ	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం
గూడూరు	1,18,874	1,25,917	34	2,44,825
సూళ్లూరుపేట	1,17,658	1,24,170	20	2,41,848
వెంకటగిరి	1,19,088	1,24,908	04	2,44,000
చంద్రగిరి	1,52,510	1,61,661	59	3,14,230
తిరుపతి	1,46,486	1,50,013	32	2,96,531
శ్రీకాళహస్తి	1,19,629	1,28,306	13	2,47,948
సత్యవేడు	1,04,076	1,10,760	11	2,14,847
మొత్తం	8,78,321	9,25,735	173	18,04,229

'అంతిమ' కష్టాలు!



ఉచ్ఛ్వాస, నిశ్వాసల మధ్యన ఊగిసలాగే బతుకు పోరు ముగిశాక ప్రశాంతంగా జరగాల్సిన చివరి మజిలీకి శ్మశాన కష్టాలూ తప్పడం లేదు. ఏర్పేడు మండలం, ఎండీ పుత్తూరు గ్రామంలో గురువారం చింత పుట్టాలమ్మ(98) మృతి చెందారు. శుక్రవారం అంతిమ సంస్కారాలకు ఏర్పాట్లు చేశారు. గ్రామానికి శ్మశాన వాటిక లేకపోవడంతో స్వర్ణముఖి నది ఒడ్డునే దహన సంస్కారాలు నిర్వహించాలని భావించారు. అయితే ఇటీవల కురిసిన వర్షాలకు నదిలో నీటి ప్రవాహం పెరిగింది. నది దాటే వీలులేని పరిస్థితి నెలకొంది. దీంతో పీకల్లోతు నీటిలోనే పాడె మోసుకుంటూ, ఆమె కుటుంబీకులు, బంధువులు నది అవతలకి దాటి అంత్యక్రియలు ముగించారు. గుప్పెడు మట్టి వేయాల్సిన దాయాదులలో కొందరు వయోభారంతో నదిని దాటలేక, గట్టుకు ఇటువైపే ఉండిపోయారు. – రేణిగుంట(ఏర్పేడు)

వేగవంతంగా సాగరమాల రోడ్డు నిర్మాణం



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్

కోట: సాగరమాల రోడ్డు నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండలంలోని విద్యానగర్ వద్ద జరుగుతున్న సాగరమాల ప్యాకేజీ-4 రోడ్డు నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం అధికారులు, కాంట్రాక్టర్లతో సమావేశమయ్యారు. సాగరమాల ప్యాకేజీ-4లో భాగంగా నాయుడుపేట నుంచి తూర్పుకనుపూరు వరకు 35 కిలోమీటర్లు రూ.960 కోట్లతో రోడ్డు నిర్మాణం జరుగుతోందని, దీనికి ఉన్న ప్రాధాన్యతను గుర్తించి పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. వర్షాల కారణంగా పనులు ముందుకు సాగలేదని అధికారులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఇరిగేషన్ పనులు నత్తనడకన సాగుతున్నాయన్నారు. 90 చోట్ల కల్వర్టులు, వంతెనలు నిర్మించాల్సి ఉందన్నారు. రోడ్డు కోసం భూములు ఇచ్చిన రైతులకు వెంటనే పరిహారం చెల్లించాలని కలెక్టర్ ఆదేశించారు. కోట మండలంలో ఊను గుంటపాళెం, కొత్తపాళెం, అగ్రహారం గ్రామాల్లో రైతులకు ఇంకా నష్టపరిహారం చెల్లించలేదని దీంతో వారు పనులను అడ్డుకునే అవకాశం ఉందని కొందరు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా గ్రామసభలు నిర్వహించి భూ సమస్యలను పరిష్కరించాలని సూచించారు. గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా, ఇరిగేషన్ ఈఈ శ్రీనివాసరావు, డీఈఈ చంద్రశేఖర్, కోట, ఓజిలి తహసీల్దార్లు జయజయరావు, పద్మావతి పాల్గొన్నారు.



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.82,960
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.7,558
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.94,000
రిటైల్ వెండి గ్రాము	రూ.97.00

క్లుప్తంగా

ఉద్యోగాలు భర్తీ చేయండి


మాట్లాడుతున్న లెనిన్ బాబు

శ్రీకాళహస్తి: దేశ వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉద్యోగాలు భర్తీ చేసి యువతకు ఉపాధి కల్పించాలని, లేని పక్షంలో గద్దె దిగాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లెనిన్‌బాబు డిమాండ్ చేశారు. శ్రీకాళహస్తి పట్టణంలో శుక్రవారం ఏఐవైఎఫ్ తిరుపతి జిల్లా రెండో మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వాలు నిరుద్యోగ సమస్యను ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రాజధాని అమరావతిని ఫ్రీ జోన్ చేసి ప్రభుత్వ ఉద్యోగాల్లో 26 జిల్లాల యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. వెంటనే మెగా డీఎస్సీ విడుదల చేసి ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐవైఎఫ్ తిరుపతి జిల్లా కార్యదర్శి కత్తి రవి, సీపీఐ నాయకుడు జనమాల గురవయ్య, బండి చలపతి, ప్రవీణ్ పాల్గొన్నారు. అనంతరం ఏఐవైఎఫ్ నూతన జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఆర్ఐఎంసీ ప్రవేశ పరీక్షపై విశ్వంలో ఉచిత అవగాహన సదస్సు

తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతి వరదరాజనగర్‌లోని విశ్వం టాలెంట్ స్కూల్లో ఆదివారం ఉదయం 10 గంటలకు డెహ్రాడూన్‌లోని 'రాష్ట్రీయ ఇండియన్ మిలిటరీ కాలేజీ'(ఆర్ఐఎంసీ) ఎనిమిదో తరగతిలో ప్రవేశాల కోసం జాతీయ స్థాయిలో నిర్వహించనున్న ప్రవేశ పరీక్షకు సంబంధించి ఉచిత అవగహన సదస్సు నిర్వాహిస్తున్నట్టు కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, విశ్వం విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ అవగాహన సదస్సుకు 7, 8వ తరగతులు చదువుతున్న విద్యార్థులు, వారి తలిదండ్రులు పాల్గొని సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని తెలిపారు. పరీక్షలో సీట్లు పొందడానికి మెళకువలను కూడా వివరిస్తారని తెలిపారు. దరఖాస్తులు సమర్పించేందుకు మార్చి 31వ తేదీ చివరి రోజని వివరించారు. మరిన్ని వివరాలకు 8688888802 / 9399976999 నంబర్లలో సంప్రదించవచ్చునని పేర్కొన్నారు.

ఒత్తిడి 'పది'ంతలు దూరం

నూతన విధానంలో పది పబ్లిక్ పరీక్షలు

- విద్యార్థులపై ఒత్తిడిలేకుండా పకడ్బందీగా చర్యలు
- మార్చి 17 నుంచి పరీక్షలు



తిరుపతి ఎడ్యుకేషన్ : పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేందుకు ప్రభుత్వ పరీక్షల విభాగం పలు మార్పులు చేపట్టింది. పరీక్షల విభాగం పరీక్షకు పరీక్షకు మధ్య ఒక రోజు విరామాన్ని ప్రకటించింది. పది పబ్లిక్ పరీక్షల్లో చేపట్టిన సంస్కరణలు ఈ విద్యా సంవత్సరం నుంచే అమలు కానున్నాయి. గతేడాది విద్యా సంవత్సరంలో మాదిరిగానే పదో తరగతి పబ్లిక్ పరీక్షలను ఏడు పేపర్లుగా నిర్వహించనున్నారు.

మార్చి 17 నుంచి పరీక్షలు

పదో తరగతి పరీక్షలు మార్చి 17 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనున్నారు. సోషల్ పరీక్ష రోజున రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని మార్చి 31 లేదా ఏప్రిల్ ఒకటో తేదీన నిర్వహించే అవకాశముంటుంది. పరీక్షల షెడ్యూల్‌ను ఇప్పటికే విడుదల చేశారు. ఆరు సబ్జెక్టులకు ఏడు పేపర్లు మాత్రమే ఉంటాయి. సైన్స్ సబ్జెక్టు తప్ప మిగిలిన అన్ని సబ్జెక్టులకు 100 మార్కులకు ఒకే రోజు పరీక్ష ఉంటుంది. ఫిజిక్స్, బయాలజీలకు ఒక్కో సబ్జెక్టుకు 50 మార్కుల చొప్పున రెండు రోజుల పాటు పరీక్షలు నిర్వహిస్తారు.

ఈ ఏడాది పరీక్షలు ఇలా..

2022–23 విద్యా సంవత్సరంలో పది పబ్లిక్ పరీక్షలను ఆరు పేపర్లకు కుదించారు. తెలుగు, హిందీ, ఇంగ్లిషు, గణితం, సైన్స్, సోషల్ సబ్జెక్టుల్లో ఒక్కో సబ్జెక్టుకు 100 మార్కులకు నిర్వహించారు. సైన్స్ సబ్జెక్టులో మాత్రం ఫిజికల్ సైన్స్, బయాలజీ సబ్జెక్టులకు సంబంధించి ఒకే ప్రశ్న పత్రం ఇచ్చారు. అయితే జవాబులు మాత్రం వేర్వేరు సమాధాన పత్రాల బుక్‌లెట్స్‌లో రాయాల్సి వచ్చేది. గత విద్యా సంవత్సరం పబ్లిక్ పరీక్షల్లో పీఎస్, బయాలజీ జవాబు పత్రాలను సంబంధిత ఉపాధ్యాయులు మూల్యాంకనం చేయడానికి వీలుగా ఇలా వేర్వేరు జవాబు పత్రాల్లో రాయించారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం విద్యార్థుల్లో ఒత్తిడిని తగ్గించి, పరీక్షల పట్ల ఉన్న భయాన్ని పోగొడుతుందని విద్యావేత్తలు భావిస్తున్నారు. 2024–25 విద్యాసంవత్సరంలో నిర్వహించే పది పబ్లిక్ పరీక్షల్లో కూడా ఆరు సబ్జెక్టులకు ఏడు పరీక్షలుగా నిర్వహించనున్నారు.

గతంలో ఇలా..

కరోనా ప్రభావంతో 2019–20, 2020–21 విద్యా సంవత్సరాల్లో పబ్లిక్ పరీక్షలను రద్దు చేశారు. కరోనా తీవ్రత తగ్గడంతో 2021–22 విద్యా సంవత్సరంలో నిర్వహించిన పబ్లిక్ పరీక్షలో 11 పేపర్లను 7 పేపర్లకు కుదించారు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్, గణితం, సోషల్ సబ్జెక్టులకు ఒక్కో పేపరుకు 100 మార్కుల వంతున పరీక్ష నిర్వహించగా, ఫిజికల్ సైన్స్, బయాలజీ పేపర్లను ఒక్కో పేపరును 50 మార్కుల వంతున నిర్వహించారు.



ఒత్తిడి తగ్గుతుంది

"పది పబ్లిక్ పరీక్షల్లో ఆరు సబ్జెక్టులకు ఏడు పేపర్లు ఉండడం వల్ల విద్యార్థులపై ఒత్తిడి తగ్గుతుంది. ప్రస్తుతం నిర్వహించే 100 మార్కుల పేపరు మోడల్‌కు అనుగుణంగా విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నాం.

– పి.గురుస్వామిరెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పబ్లిక్ ఎగ్జామినేషన్స్, తిరుపతి



అంచనా వేసేందుకు వీలవుతుంది

ఒక్కో సబ్జెక్టును వంద మార్కులకు ఒకటే పేపరుతో పరీక్ష నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో భయాందోళనలు తగ్గుతాయి. విద్యార్థుల అకడమిక్ స్థాయిని కచ్చితంగా అంచనా వేయడానికి సాధ్యమవుతుంది.

– కేవీఎస్.కుమార్, జిల్లా విద్యాశాఖాధికారి(డీఈఓ), తిరుపతి

గంజాయి స్వాధీనం


నిందితులతో ఎస్ఐ వెంకటేష్

నాగలాపురం: గంజాయి తరలించిన కేసులో ఐదుగురు నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు పిచ్చాటూరు ఎస్ఐ వెంకటేశులు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. పుత్తూరు సీఐ రవీంద్ర ఆదేశాలు మేరకు మండలంలోని వెంగళత్తూరు గ్రామం వద్ద శుక్రవారం ఉదయం పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్నారు. అదే సమయంలో అటువైపుగా ఓజీ కుప్పం నుంచి తమిళనాడు వైపు వెళ్తున్న కొందరు వ్యక్తులను గమనించి వారి వద్ద తనిఖీ చేశారు. వారి వద్ద నుంచి 400 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ తెలిపారు. వెంటనే వారిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. విచారణలో వెంగళత్తూరుకు చెందిన లారెన్స్(21), హానెస్ట్‌రాజ్(22), తమిళనాడులోని వెళ్లాత్తుకోట్టైకి చెందిన చిన్నమణి(20), సీతంజేరికి చెందిన సతీష్‌కుమార్(20), పెన్నలూరు పేట్టైకి చెందిన శరత్(20)గా గుర్తించారు. వారిని సత్యవేడు కోర్టులో హాజరు పరచగా.. జడ్జి వారికి పదిహేను రోజుల పాటు రిమాండ్ విధించినట్టు ఎస్ఐ పేర్కొన్నారు.

గీత కార్మికులకు 23 మద్యం దుకాణాలు

- 27 నుంచి వచ్చే నెల 5 వరకు దరఖాస్తుల స్వీకరణ
- లాటరీ పద్ధతిలో షాపుల కేటాయింపు
- ఎక్సైజ్ అధికారుల నేతృత్వంలో ఏర్పాట్లు
- దుకాణాల కోసం బినామీలు సిద్ధం!


జేసీ ఆధ్వర్యంలో కులాల వారీగా మద్యం షాపులను కేటాయిస్తున్న ఎక్సైజ్‌శాఖ అధికారులు

తిరుపతి క్రైం: కల్లుగీత కార్మికులకు జిల్లాలో 23 దుకాణాలను కేటాయించనున్నారు. ఆ మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లో జేసీ శుభం బన్సల్ ఆధ్వర్యంలో ఎక్సైస్ శాఖ అధికారుల సమక్షంలో దిశానిర్దేశం చేశారు. 23 దుకాణాలకు సంబంధించి గౌడ్ కులానికి 3, ఈడిగకు 15, గౌడు కులానికి 2, గౌండ్ల కులానికి 3 దుకాణాలను కేటాయించారు. ఈ దుకాణాలను తిరుపతి కార్పొరేషన్ పరిధిలో 1, జిల్లాలోని మున్సిపాలిటీల పరిధిలో 6, మిగిలిన 16 షాపులను మండలాల పరిధిలో ఏర్పాటు చేయనున్నారు.

వచ్చే నెల 5 వరకు దరఖాస్తుల స్వీకరణ

తిరుపతి కార్పొరేషన్ పరిధిలోని మద్యం దుకాణం ఈడగ కులానికి లాటరీలో వచ్చింది. అలాగే మున్సిపాలిటీ పరిధిలోని 6 దుకాణాలు అన్ని కులాలకు దక్కాయి. అదేవిధంగా మండలాల్లోని 16 దుకాణాలను అన్ని కులాలకు కేటాయించారు. ఏ దుకాణానికి ఏ కులం వారు దరఖాస్తు చేసుకోవాలి అనే అంశంపై మాత్రమే శుక్రవారం గీత కార్మికుల సమక్షంలో జేసీ చర్చించారు. ఆ మేరకు ఆ దుకాణానికి చెందిన వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఈనెల 27 నుంచి వచ్చే ఫిబ్రవరి 5వ తేదీ వరకు షాపుల దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. ఆ తర్వాత దరఖాస్తులను పరిశీలించి లాటరీ పద్ధతిలో మద్యం దుకాణాలను కేటాయించనున్నారు.

పారదర్శకంగానే దుకాణాల కేటాయింపు

కలెక్టరేట్‌లో కల్లుగీత కార్మికులతోపాటు ఉప కులాలకు జనాభా ప్రాతిపదికన షాపుల కేటాయింపు పారదర్శకంగా చేశామని జేసీ చెప్పారు. ఆ మేరకు అందరి అభిప్రాయం ప్రకారం కేటాయింపు చేశామని వెల్లడించారు. డిప్యూటీ కమిషనర్ ఎక్సైజ్ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధికారి విజయశేఖర్, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారి నాగమల్లీశ్వర్‌రెడ్డి, బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి చంద్రశేఖర్, సమాచార పౌరసంబంధాల అధికారి బాలకొండయ్య పాల్గొన్నారు.

బినామీలు సిద్ధం

గీత కార్మికుల మద్యం దుకాణాలు కొల్లగొట్టేందుకు పచ్చ బినామీలు సిద్ధంగా కూర్చున్నారు. గీత కార్మికుల పేరుతో వచ్చే దుకాణాలను కొట్టేసేందుకు పచ్చ బినామీలు ఇప్పటికే సర్వం సిద్ధం చేసుకున్నట్లు చర్చసాగుతోంది. మద్యం దుకాణాల కేటాయింపు అనంతరం తమ మనుషుల పేరున షాపులను నిర్వహిస్తారని తెలుస్తోంది.

కల్కి ఆక్రమిత భూములను పరిరక్షించండి



మాట్లాడుతున్న నార్నె వెంకటసుబ్బయ్య

తిరుపతి కల్చరల్: సత్యవేడు నియోజకవర్గం బుచ్చినాయుడు కండ్రిక మండలం, కళ్లివెట్టు గ్రామ సర్వే నం.295లోని అంజూర్ అటవీ శాఖకు చెందిన 20 ఎకరాల భూమిని కల్కి ట్రస్ట్ ఆశ్రమం పేరుతో ఆక్రమించారని, ఆ భూములను పరిరక్షించాలని భారత హేతువాద సంఘం అధ్యక్షుడు నార్నె వెంకటసుబ్బయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అటవీశాఖ భూములతో పాటు పేదల భూములను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంతో పాటు విదేశీయులను రప్పించి యాగాలు, యోగాలు, ధ్యానం అంటూ అటవీశాఖ నిబంధనలకు విరుద్ధంగా పర్యావరణాన్ని నాశనం చేస్తున్నారని విమర్శించారు. సనాతన ధర్మ పరిరక్షణనే తన లక్ష్యం అంటూ ప్రకటించిన డెప్యూటీ సీఎం, అటవీశాఖ మంత్రి పవన్ కల్యాణ్ అధర్మంగా కల్కి ట్రస్ట్ భూములు ఆక్రమిస్తే ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా దీనిపై స్పందించాలని కోరారు. హేతువాద సంఘం నేత డాక్టర్ ఏఆర్.రెడ్డి, బాధితుడు మునిచంద్ర పాల్గొన్నారు.

సిలిండర్ పేలి ముగ్గురికి గాయాలు


సిలిండర్ పేలిన వంటగది ఇదే

వెంకటగిరి(సైదాపురం): తెల్లవారు జామున సిలిండర్ పేలింది. ఈ ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడగా.. మరొకరికి స్వల్పగాయాలయ్యాయి. ఈ ఘటన వెంకటగిరి మున్సిపల్ పరిధిలోని బంగారుపేట గ్రామంలో శుక్రవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం .. వెంకటగిరి మున్సిపల్ పరిధిలోని బంగారుపేట గ్రామంలో కొంపాల వెంకటేశ్వర్లు (62) నివాసం ఉంటున్నారు. శుక్రవారం తెల్లవారు జామున వెంకటేశ్వర్లు భార్య అనసూయమ్మ (60) టీ పెట్టేందుకు వంట గదికి చేరుకుంది. ఆ సమయంలో టీ పెట్టేందుకు స్టౌను అంటించే క్రమంలో ఒక్కసారిగా సిలిండర్ పేలింది. పెద్ద శబ్దం రావడంతో చుట్టుపక్కల వారంతా ఉలిక్కిపడ్డారు. అప్పటికే తల్లి అనసూయమ్మ, కుమారుడు ఈశ్వరయ్య(41)కు తీవ్ర గాయాలయ్యాయి. వెంకటేశ్వర్లు స్వల్పంగా గాయపడ్డారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం వెంకటగిరి ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తరలించారు. వెంకటగిరి పోలీసులు కేసును నమోదు చేసి విచారణ చేపట్టారు. అనసూయమ్మ పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం.

మంటలను అదుపు చేసిన సిబ్బంది

సిలిండర్ పేలడంతో ఇంట్లో నుంచి మంటలు ఎగిసి పడ్డాయి. స్థానికులు వెంకటగిరి అగ్నిమాపక సిబ్బందికి సమాచారాన్ని అందజేశారు. దీంతో సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.



గణతంత్ర దినోత్సవానికి తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయం ముస్తాబయ్యింది. విమానాశ్రయ టెర్మినల్ భవనం త్రివర్ణ విద్యుత్ దీపాలతో శోభిల్లుతోంది. టెర్మినల్ వద్ద ప్రయాణికులు సెల్ఫీలతో సందడి చేయడం కనిపించింది. – శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట)

ఉపాధ్యాయులకు శిక్షణ


శిక్షణకు హాజరైన ఉపాధ్యాయులతో నిర్వాహకులు, అతిథులు

తిరుపతి కల్చరల్: సీబీఎస్సీ, ఐఎస్‌టీఎం సంయుక్త ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు ట్రెనింగ్ ఆఫ్ ట్రైనర్స్ సర్టిఫికేషన్ కోర్సు శిక్షణ తరగతులు తిరుపతి కేంద్రంగా కాండర్ పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. ఐఎస్‌టీఎం జాయింట్ డైరెక్టర్ సమితా మాలిక్, అడ్వైజర్ ఆన్ రీసెర్చ్ అండ్ కెపాసిటీ బిల్డింగ్ జేబీ. రాజన్, ఢిల్లీ స్కూల్ అకడమిక్ డైరెక్టర్ సునీర్‌నాగతి, హెడ్ సీఓఈ వి.అరుణ మాట్లాడారు. న్యూ ఎన్ఈపీకి అనుగుణంగా ఉపాధ్యాయులకు శిక్షణ, దానికి సంబంధించిన సరికొత్త బోధనా పద్ధతులను వివరించారు. కాండర్ హెచ్ఎం, వెన్యూ డైరెక్టర్ ఆకుల నాగశ్వేత మాట్లాడుతూ, తమ విద్యాసంస్థలో రెండ్రోజులపాటు ట్రెనింగ్ ఇవ్వడం గొప్ప అవకాశంగా భావిస్తున్నామన్నారు. రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

థాయ్‌లాండ్ వర్సిటీతో ఎంఓయూ


థాయ్‌లాండ్ అధ్యాపక బృందంతో చర్చిస్తున్న ప్రిన్సిపల్

తిరుపతి సిటీ: థాయ్‌లాండ్ మేజో యూనివర్సిటీతో పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల అంతర్జాతీయ స్థాయి పరిశోధనల కోసం పలు అంశాలపై ఎంఓయూ కుదుర్చుకుంది. శుక్రవారం ఎస్పీడబ్ల్యూ కళాశాల వేదికగా జరిగిన ఈ కార్యక్రమంలో థాయ్‌లాండ్ వర్సిటీలకు చెందిన అధ్యాపకులు పద్మావతి కళాశాల అధ్యాపక బృందంతో పరిశోధన, నైపుణ్యాభివృద్ధిపై చర్చించారు. అనంతరం ప్రిన్సిపల్ డాక్టర్ టీ. నారాయణమ్మ మాట్లాడుతూ థాయ్‌లాండ్ మేజో యూనివర్సిటీతో ఎంఓయూ కుదుర్చుకోవడం వల్ల పరిశోధనాభివృద్ధిని పెంపొందించుకోవచ్చని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. యువాలీ అన్ పోప్రోమ్, ప్రొఫెసర్ రమేష్ ప్రభు రామరాజ్, ప్రొఫెసర్ ఆరీఫ్ పుల్లా, ఎస్పీడబ్ల్యూ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

వేదం వినిపించదేం శివయ్యా!

– రాహు– కేతు మండపాలు, ఆశీర్వాదాలకే పరిమితమవుతున్న వేదపండితులు


ఖాళీగా దర్శనమిస్తున్న వేదపారాయణ ఆసనాలు

శ్రీకాళహస్తి: నిత్యం వేదపారాయణంతో విరాజిల్లాల్సిన శివాలయం బోసిపోయింది. వేదాలు పారాయణం చేస్తే ఏమొస్తుంది.... అని అనుకున్నారేమో మరి వేద పండితులు.. శుక్రవారం వేదపండితులు రాహు-కేతు మండపాలకు, ఆశీర్వాదాలకే పరిమితమయ్యారని సోషల్‌మీడియా వేదికగా విమర్శలు వ్యక్తమయ్యాయి. శ్రీకాళహస్తీశ్వరాలయంలో యజుర్వేదం, అథర్వణవేదం, సామవేదం, రుగ్వేదం పారాయణం చేసేందుకు 20 మంది, తైవారం చేసేందుకు ఒకరు మొత్తం 21 మంది వేదపండితులు ఉన్నారు. వీరికి నిత్యం వేదాలు పఠించేలా గర్భాలయం చెంత గల సహస్రమండపం వద్ద ఏర్పాట్లు చేపట్టారు. కానీ ఇది శుక్రవారం బోసిపోయి కనిపించింది. ఇది సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత వేదపండితులందరూ రాహు-కేతు మండపాలు, ఆశీర్వాద మండపాలకే పరిమితమవుతున్నారు. భక్తుల నుంచి ససంభావన తీసుకోవడంలో మునిగితేలుతున్నారు. గతంలో ఈఓగా పనిచేసిన ఆజాద్ వేదపండితులు రాహు-కేతు మండపాల్లో ఉండకూడదని ఆదేశాలు జారీచేశారు. కానీ ప్రస్తుత ఈవో వేదపండితులను రాహు-కేతు మండపాలకు కేటాయించడంతో విమర్శలు వస్తున్నాయి. శివయ్య చెంత నిత్యం వేదపారాయణం జరిగేలా చూడాలని భక్తులు కోరుతున్నారు.

తిరుమల నంబి సన్నిధిలో మలయప్ప స్వామి

తిరుమల: తిరుమలలో 25 రోజుల పాటు అధ్యయనోత్సవాలు పూర్తయిన సందర్భంగా మరుసటి రోజు శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీ మలయప్ప స్వామి వారు శుక్రవారం సాయంత్రం దక్షిణ మాడ వీధిలో తిరుమల నంబి సన్నిధిని దర్శించుకున్నారు. సహస్ర దీపాలంకార సేవ అనంతరం సన్నిధిని దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. పలువురు ఆలయ అధికారులు పాల్గొన్నారు.

లింగ వివక్ష నిర్మూలనకు చర్యలు


సదస్సులో మాట్లాడుతున్న అతిథులు

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీలో శుక్రవారం జాతీయ బాలికా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మహిళా అధ్యయన విభాగం, న్యాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఐసీఎస్ఎస్ఆర్ సదరన్ రీజినల్ సెంటర్ సౌజన్యంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. లింగ అంతరాన్ని తగ్గించడం, పని ప్రదేశంలో లింగ సమానత్వాన్ని స్థాపించడం అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించారు. గౌరవ అతిథిగా అమర హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గౌరినేని రమాదేవి మాట్లాడారు. ప్రాథమిక స్థాయి నుంచే బాల బాలికల మధ్య లింగ అసమానతలు ఉండటం బాధాకరమన్నారు. ఈ వివక్ష నిర్మూలనకు, పాఠశాల విద్యా వ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఉపకులపతి ప్రొఫెసర్ ఉమ మాట్లాడుతూ, స్త్రీ, పురుషులు ఇరువురూ సమానంగా చూడాల్సిన బాధ్యత సమాజంపై ఉందన్నారు. సదస్సులో వివిధ రాష్ట్రాలకు చెందిన దాదాపు 50 మంది పరిశోధన పత్రాలు సమర్పించారు. మహిళా అధ్యయన కేంద్ర డైరెక్టర్ ప్రొఫెసర్ సి.వాణి, హెడ్ డాక్టర్ నీరజ, సెమినార్ కో-డైరెక్టర్స్ డాక్టర్ రజని, డాక్టర్ ఇందిరా ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంతి భవనాల పునర్నిర్మాణానికి కార్యాచరణ



భవనాలను పరిశీలిస్తున్న ఈఓ, అదనపు ఈఓ

తిరుమల: తిరుమలలో కాలం చెల్లిన విశ్రాంతి గృహాల స్థానంలో కొత్త భవనాల నిర్మించడానికి కార్యాచరణ రూపొందించాలని టీటీడీ ఈఓ జె.శ్యామలరావు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. తిరుమలలో శుక్రవారం అదనపు ఈఓ సీహెచ్.వెంకయ్యచౌదరితో కలిసి సుదర్శన్, గోవర్ధన్, కళ్యాణి, సి-టైప్ క్వార్టర్లు, పద్మావతి ప్రాంతంలోని కొన్ని ప్రదేశాలను పరిశీలించారు. సాధారణ భక్తుల సౌకర్యార్థం సదరు ప్రదేశాలలో విశ్రాంతి గృహాలను పునర్నిర్మించడానికి నిర్దిష్ట ప్రణాళికను రూపొందించాలని సీఈ సత్యనారాయణను ఆదేశించారు.

గుర్తించిన సమస్యలివే

విశ్రాంతి గృహాలన్నీ 6వ దశాబ్దాల క్రితం నిర్మించడంతో వర్షాకాలంలో లీకేజీలతో భక్తులు అవస్థలు పడుతున్నారు. సరైన పార్కింగ్ సదుపాయాలు, విశాల స్థలం లేదు. భవన నిర్మాణాలు పాత పద్ధతిలో నిర్మించడంతో భవనాల ఉనికే ప్రశ్నార్థకంగా మారింది. పాత భవనాలలో లీకేజీలు, అపరిశుభ్రత, పార్కింగ్ తదితర అంశాలపై భక్తుల నుంచి టీటీడీకి ఫిర్యాదులు వస్తున్నాయి. దీంతో ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా భవనాలను పునర్నిర్మించాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. డిప్యూటీ ఈఓలు భాస్కర్, హరీంద్రనాథ్, ఈఈలు పాల్గొన్నారు.

ఒంటరి ఏనుగును మళ్లించిన అధికారులు


రోడ్డు దాటుతున్న ఒంటరి ఏనుగు

పాకాల: మండలంలోని పదిపుట్లబైలు పరిసర ప్రాంతాల్లో సంచరిస్తున్న ఒంటరి ఏనుగును శుక్రవారం అటవీశాఖ అధికారులు తిరుపతి జిల్లా అటవీ పరిధిని దాటించారు. 4,5 రోజులుగా మండలంలోని పదిపుట్లబైలు పంచాయతీ, కొమ్మిరెడ్డిగారిపల్లె రోడ్డు మార్గంలోని చింతలవంక డ్యామ్ పరిసర ప్రాంతాల్లో ఏనుగు సంచరిస్తున్నట్లు సమాచారం అందడంతో అధికారులు దీనికి కోసం గస్తీ నిర్వహించారు. ప్రజలు, రైతులు సమీప ప్రాంతాల్లోకి వెళ్లకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. సుమారు 30 మంది అటవీశాఖ సిబ్బంది, ట్రాకర్స్‌తో గాలించారు. రాత్రి 7.30 ప్రాంతంలో ఏనుగును గుర్తించిన అధికారులు సిబ్బంది మండల సరిహద్దుల నుంచి తరలించారు. దీంతో అది చిత్తూరు జిల్లా అటవీ ప్రాంతంలోకి ప్రవేశించింది. దీంతో స్థానిక రైతులు, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.